జీవితం ఒక ఉత్సవం పుస్తకావిష్కరణ

డా. బీవీ పట్టాభిరామ్ దంపతులకు సన్మానం చేస్తున్న ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, కేవీపీ రాంచందర్ రావు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, విశ్రాంత ఐఏఎస్ బి.జనార్దన్‌రెడ్డి, తదితరులు

సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ): తెలుగు ప్రజలు గర్వించదగిన ఒకే ఒక మనసు భాష ఇంద్రజాలికుడు డాక్టర్ బీవీ పట్టాభిరాం అని పలువురు ప్రముఖులు కొనియాడారు. డాక్టర్ బీవీ పట్టాభిరాం రాసిన 'జీవితం ఒక ఉత్సవం' బతుకు కథ పుస్తకాన్ని ఆయన వైవాహిక స్వర్ణోత్సవం సందర్భంగా ఎమ్మెస్కో విజయ్ కుమార్ ఆదివారం దస్‌పల్లా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అట్టహాసంగా ఆవిష్కరించారు. ఐంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, మానవ సంబంధాల కౌన్సెలర్‌గా, ప్రజా ప్రతినిధులకు కమ్యూనికేషన్ గురువుగా పట్టాభిరాం తెలుగువారి కీర్తి ప్రతిష్టలను విశ్వ వ్యాప్తం చేశారన్నారు. నిర్వేదంలో ఉన్న యువతను కాపాడి, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించి జాతీయ స్థాయిలో ప్రామాణికత కలిగిన రిలేషన్‌షిప్ కౌన్సెలర్‌గా గుర్తింపు పొందారని కొనియాడారు. తెలుగు జాతి గౌరవాన్ని పట్టాభిరాం ఇనుమడింపజేశారని ప్రముఖులు ప్రసంశించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ సోమయాజులు, సినీ నటులు రాజేంద్రప్రసాద్, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్ కుమార్, డాక్టర్ కేవీపీ రాంచందర్ రావు, మాజీ సీఎస్‌లు ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఐవీఆర్ కృష్ణారావు, మాజీ మంత్రి బుద్ధప్రసాద్, ఏపీ రవాణా శాఖ అడిషనల్ కమిషనర్ ప్రసాదరావు, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో రామోజీ మార్గదర్శకులు

రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నమస్తే తెలంగాణ సంపాదకులు తిగుళ్ల కృష్ణమూర్తి, సీనియర్ జర్నలిస్ట్ కె.రామచంద్రమూర్తి, ఈనాడు ఏపీ ఎడిటర్ ఎం.నాగేశ్వర్ రావు, తెలంగాణ ఎడిటర్ డీఎన్ ప్రసాద్, విరాహత్ అలీ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల నాయుడు

ఖైరతాబాద్, జూన్ 16: తెలుగు జర్నలిజానికి ఓ ప్రత్యేక స్థానాన్ని తీసుకొచ్చిన 'ఈనాడు' సంస్థల అధినేత దివంగత రామోజీరావు ఈ వృత్తిలో కొనసాగుతున్న వారికి మార్గదర్శకులుగా నిలుస్తారని పలువురు వక్తలు అన్నారు. రామోజీరావు సంతాప సభ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈనాడు పత్రికలో తమ ప్రస్థానం ప్రారంభించి వివిధ పత్రికల్లో ఉన్నత స్థాయిలో ఉన్న సంపాదకులు, జర్నలిస్టులు రామోజీరావుతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. అంతకు ముందు రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ.. రామోజీ రావుతో తన అనుబంధాన్ని సభికులతో పంచుకున్నారు. 1994లో ఈనాడులో చేరినప్పుడు చైర్మన్‌గా ఉన్న రామోజీరావు తనను స్వయంగా ఇంటర్వ్యూ చేశారని గుర్తు చేసుకున్నారు. ఒక మనిషి తనను తాను మార్చుకోగలడని, అలాంటి శక్తి రామోజీరావులో చూశానని, ఇది తనకు ఎదురైన అనుభవంగా గుర్తు చేసుకున్నారు. తాను సెంట్రల్ డెస్క్‌లో పనిచేసే తరుణంలో కంప్యూటర్లు కావాలని అడిగితే వెంటనే సమకూర్చారని, కొత్త సాంకేతికతను ఆపాదించడంలో ఆయన ముందున్నారని అన్నారు. అవతలి వారు చేసే కృషిని, వారి కష్టాన్ని ప్రజెంట్ చేసే పరిస్థితి వచ్చినప్పుడు ఏనాడు వెనుకాడేవారు కాదని, తాను సూచించిన గ్రహం అనుగ్రహం అలానే వచ్చిందన్నారు. నిర్ణయాలు తీసుకోవడంలోనూ తన నిర్ణయం తప్పని తెలిసినప్పుడు దానిని ఉపసంహరించుకోవడంలోనూ ఆయన అంతే సాహసం చూపించారన్నారు. గొంతులో ప్రాణం ఉండగా, చేయాల్సిన పని చేయాలి, చేయకూడని పని చేయొద్దు, ఈ రెండింటికి రామోజీరావు ఉదాహరణ అని అన్నారు. రాయిని రత్నంగా సానబెట్టగలిగిన శక్తి రామోజీరావు సొంతమని, అలాంటి సానబట్టబడిన వ్యక్తిలో తానొకరినని, తాను ఈ స్థాయిలో ఉండటానికి ఆయనే కారణమన్నారు. రామోజీరావు తనకు జీవితకాలపు మార్గదర్శి అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ఈనాడు ఏపీ ఎడిటర్ ఎం.నాగేశ్వర్ రావు, తెలంగాణ ఎడిటర్ డీఎన్ ప్రసాద్, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సీనియర్ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, వల్లీశ్వర్, పీఎస్ఆర్‌సీ మూర్తి, కందుల రమేశ్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్. వేణుగోపాల నాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మెహిదీపట్నం సంతోష్‌నగర్ కాలనీలోని సెయింట్ అన్స్ మహిళా పీజీ కళాశాలలో ఆదివారం జరిగిన పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పరీక్ష కోసం చేసిన ఏర్పాట్లను, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, పరీక్ష పారదర్శకంగా జరిగేందుకు సీసీ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు జరిగిన పేపర్-1 పరీక్షకు 25,875 మంది హాజరు కాగా, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగిన పేపర్-2 పరీక్షకు 25,661 మంది హాజరయ్యారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 19,492 మంది గైర్హాజరయ్యారని, కేవలం 56-57 శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాశారని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన పర్యవేక్షించారు.

సమర్థంగా మెట్రో సేవలు

- మెట్రో అధికారుల ముందస్తు కార్యాచరణ సిద్ధం
- నగర ప్రజా రవాణాలో కీలకం.. మెట్రో రైలు

సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ): మహానగర ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో రైలు అత్యంత కీలకంగా మారింది. రోడ్లపై గంటల తరబడి ట్రాఫిక్ చిక్కులు లేకుండా నిర్ణీత సమయంలో కచ్చితంగా గమ్య స్థానాన్ని చేరుకునేలా ప్రధాన ప్రయాణ సాధనంగా మెట్రో నిలిచింది. ప్రతి రోజు సుమారు ఐదు లక్షల మంది ప్రయాణం చేస్తున్న మెట్రోను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు మెట్రో అధికారులు ఇటీవల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. మెట్రోలో ప్రయాణించే వారి నమ్మకాన్ని వమ్ము చేయడానికి వారిని గమ్య స్థానాలను చేర్చేందుకు పటిష్టమైన ముందస్తు కార్యాచరణను హైదరాబాద్ మెట్రో అధికారులు సిద్ధం చేశారు. మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించారు. మొత్తం మూడు కారిడార్‌లలో 69 కి.మీ మేర విస్తరించి ఉన్న మెట్రో మార్గాల్లో క్షేత్ర స్థాయిలో వయా డక్ట్‌లను సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేస్తున్నారు. మెట్రో మార్గాల్లో వయా డక్ట్ పక్కనే ఉన్న చెట్లను కత్తిరించడం, విద్యుత్ ట్రాక్షన్ సిస్టమ్ పడే ఇతర వస్తువులను తొలగించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా..

ప్రస్తుత వర్షా కాలం సీజన్‌లో భారీ వర్షాలు, ఈదురు గాలులు వచ్చే సమయంలో రైలు సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు, విద్యుత్ సరఫరాకు సంబంధించి ట్రాన్స్‌కో నుంచి మెట్రో రైలు నెట్ వర్క్‌లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా ఎల్‌క్ట్రిక్ ఫీడర్లకు మార్చడానికి ఉన్న అవకాశాలను గుర్తించనున్నారు. ఇప్పటికే కారిడార్-1లో ఎంజీబీఎస్ వద్ద, మియాపూర్‌లలో విద్యుత్ సబ్ స్టేషన్‌లు ఉన్నాయి. ఈ రెండు సబ్ స్టేషన్లకు ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఇక్కడి నుంచి మెట్రో రైలు నెట్ వర్క్ కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎల్‌క్ట్రికల్ విభాగం అధికారులకు మెట్రో అధికారులు పలు సూచనలు చేశారు.

పరిగణనలోకి గత అనుభవాలు..

హైదరాబాద్ నగరంలో మెట్రో సేవలు ప్రారంభమై సుమారు ఆరేండ్లు దాటింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలుమార్లు మెట్రో సేవలకు అంతరాయం కలిగింది. వీటన్నింటినీ ఒకసారి సమగ్రంగా అధ్యయనం చేసి, అలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా, ఒకవేళ సాంకేతిక సమస్య తలెత్తినా వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశారు. మెట్రో స్టేషన్లు మొదలుకొని వయా డక్ట్‌ల పొడవునా విద్యుత్ ట్రాక్షన్‌పై పడిన వస్తువులతో కలిగిన ఇబ్బందులు మళ్లీ జరగకుండా చూడాలని, అలాంటి ప్రదేశాలను గుర్తించి, అక్కడ మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. మెట్రో సేవలు ఉదయం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు నిరంతరాయం అందించేందుకు పటిష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లేలా మెట్రో అధికారులు చర్యలు చేపట్టారు. వర్షా కాలంలో నగరంలో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉండే అవకాశం ఉండటంతో మెట్రోలోనే ప్రయాణించేందుకు నగరవాసులు ఆధారపడతారు. ఈ నేపథ్యంలో మెట్రో సేవల్లో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ముందస్తు కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని మెట్రో అధికారులు తెలిపారు.

మాట్లాడుతున్న డాక్టర్ వైద్యనాథ్

అన్ని శాఖల్లో ప్రమోషన్ ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలి

చిక్కడపల్లి, జూన్ 16: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ప్రమోషన్ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్ డిమాండ్ చేశారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సమావేశం బాగ్‌లింగంపల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైద్యనాథ్ మాట్లాడుతూ, ఉద్యోగులకు సంబంధించినటువంటి అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రధానంగా జీవో నం. 317 సమస్యలను పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులకు వాహన సదుపాయాల కల్పించాలని, పెండింగ్‌లో ఉన్నటువంటి బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు ఏలూరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఏవీజీకే ప్రసాద్, కోశాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

క్వారీల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

మన్సూరాబాద్, జూన్ 16: తెలంగాణ మైన్స్, సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ (టీఏఎంఎస్ఎల్ఏ) ఆవిర్భావ దిన వేడుకలను మన్సూరాబాద్ డివిజన్ పరిధి లెక్చరర్స్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ మైన్స్, సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుర్వి దామోదర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక తెలంగాణ ఫ్రంట్ చైర్మన్ వెన్నపూజ పరశురాం మాట్లాడుతూ, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇసుక క్వారీలలో ఎస్ఆర్ఓ, పీఓలు జరుపుతున్న అక్రమ దందాపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్లను బెదిరించి లారీల్లో ఓవర్ లోడింగ్ చేస్తున్నారని తెలిపారు. ఓవర్ లోడింగ్‌తో లారీలు రోడ్డుపైకి రాగానే ఆర్టీఏ అధికారులు, పోలీసులు దాడులు చేసి చలాన్లు విధిస్తున్నారన్నారు. టీఎస్ఎండీసీ అధికారులు ఇప్పటికైనా మేల్కొని క్వారీల్లో సంవత్సరాల తరబడి తిష్టవేసి ఇసుక అక్రమ దందాకు పాటుపడుతున్న ఎస్ఆర్ఓ, పీఓలను బదిలీ చేయాలన్నారు. తెలంగాణ మైన్స్, సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుర్వి దామోదర్ మాట్లాడుతూ, సాండ్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా.. 5కే రన్

- ప్రతి ఒక్కరు మొక్కల్ని పెంచాలి: ఉమర్ అలీషా

ర్యాలీని ప్రారంభిస్తున్న ఉమర్ అలీషా

బేగంపేట్, జూన్ 16: కోరలు చాచిన కాలుష్య కారకం నుంచి పర్యావరణాన్ని రక్షించడమే లక్ష్యంగా ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ఆదివారం అవగాహన పరుగు నిర్వహించింది. సంజీవయ్య పార్కు నుంచి జలవిహార్ వరకు చేపట్టిన ఈ 5కే రన్‌ను ట్రస్ట్ చైర్మన్ శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ అలీషా జెండా ఊపి ప్రారంభించారు. పర్యావరణం పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా వన సంపదను పెంచడమే ప్రధాన ధ్యేయంగా మహోత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టినట్టు వారు తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మొక్కల్ని పెంచితే ప్రకృతి పరవశించి పోతుందని అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రజలంతా నీటి సంరక్షణకు పాటు పడాలని, ప్రకృతి ప్రసాదించిన వర్షపు నీటిని ఒడిసి పట్టి నీటిని కాపాడుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా కాలుష్యం సమస్త జీవకోటిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలో, భూమిలో కలవకుండా చూడాలని చెప్పారు. ప్రజలకు ఇలా అవగాహన కల్పించేందుకు ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంపై కిమ్స్‌లో రెండు రోజుల సదస్సు

సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు

బేగంపేట్, జూన్ 16: న్యూరో రిహాబిలిటేషన్‌లో సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంపై కిమ్స్ ఆసుపత్రికి చెందిన న్యూరో విభాగం వారు రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సును శని, ఆదివారాల్లో నిర్వహించారు. దీనికి తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 200లకు పైగా ఫిజియో థెరపిస్టులు హాజరయ్యారు. ఈ సదస్సులో కిమ్స్ ఆసుపత్రి న్యూరో రిహాబిలిటేషన్ విభాగాధిపతి డాక్టర్ అజయ్ కుమార్, ఆసుపత్రి ఎండీ గ్రూప్ చైర్మన్ డాక్టర్ భాస్కర్ రావు ప్యాట్రన్‌గా న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహిలు పాల్గొన్నారు.

స్వరాష్ట్ర వైతాళికుడు ప్రొఫెసర్ కేశవరావు జాదవ్

ప్రొ. కేశవరావు జాదవ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అభిషేక్ రంజన్ సింగ్, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రొ. గాలి వినోద్‌కుమార్ తదితరులు

ఖైరతాబాద్, జూన్ 16: ప్రజా ఉద్యమాల ఆధ్యుడు, స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ చిరస్మరణీయుడని వక్తలు కొనియాడారు. ప్రొఫెసర్ కేశవ్ రావు జాదవ్ ఆరవ వర్ధంతిని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామ్ మనోహర్ లోహియా రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ అభిషేక్ రంజన్ సింగ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేశవరావు జాదవ్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు.

కర్ర పూజ మేమే చేస్తాం.. కాదు..

నేడు ఖైరతాబాద్ గణేశుడి కర్ర పూజ

ఉత్సవ కమిటీలో విభేదాలు...

వేర్వురుగా కమిటీలు

ఖైరతాబాద్, జూన్ 16: ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన ఖైరతాబాద్ మహా గణేశుడికి అంకురార్పణ (కర్ర పూజ) క్రతువు నేటి (సోమవారం) సాయంత్రం ఐదు గంటలకు గణపతి ప్రాంగణంలో నిర్వహించనున్నారు. అయితే, ఈ ఏడాది ఎవరు చేస్తారన్న విషయంలో సందిగ్ధం నెలకొన్నది. గణేశుడి కర్రపూజ తామే నిర్వహిస్తామని నూతనంగా ఏర్పడిన ఖైరతాబాద్ శ్రీ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం పాత కార్యవర్గమైన ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ తామే నిర్వహిస్తామని ప్రకటించడం సభ్యుల మధ్య ఉన్న విభేదాలు వెలుగు చూశాయి. గత 70 ఏండ్లుగా ఉత్సవ కమిటీ వ్యవస్థాపకులు దివంగత సింగరి శంకరయ్య కుటుంబ సభ్యులు స్థానిక బస్తీవాసులతో కలిసి నవరాత్రోత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఖైరతాబాద్ గణేశుడిని దర్శించుకునేందుకు దేశ, విదేశాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. నవరాత్రులు పూర్తయ్యే సరికి సుమారు 40 నుంచి 50 లక్షల మంది స్వామి వారిని దర్శించుకుంటారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో కోట్లాది రూపాయల విరాళాలు, మొక్కుబడులు చెల్లించుకుంటారు. దేశ, విదేశాల నుంచి స్వామి వారికి మొక్కులు సమర్పిస్తారు.

500 కోట్లకు పైగా భూ కుంభకోణం

- కాస్తులో ఉన్నా రికార్డుల్లో పేర్లు తారుమారు
- కీసరలో 2006 నుంచి దళితుల పోరాటం
- తాజాగా సొంత సర్కారుపైనే వీహెచ్ ఆరోపణలు
- హాట్ టాపిక్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత వ్యాఖ్యలు

కీసరలోని భూములలో విల్లా ప్రాజెక్ట్‌ల నిర్మాణాలు

మేడ్చల్, జూన్ 16(నమస్తే తెలంగాణ): కాస్తులో ఉండగానే రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు తారుమారయ్యాయని, 94 ఎకరాల భూమిని రాగి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఫోర్జరీ సంతకాలతో రికార్డుల్లో నమోదు చేసుకొని దాదాపు రూ.500 కోట్లకు పైగా భూ కుంభకోణానికి పాల్పడ్డారని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసరలోని బాధిత దళితులు ఆరోపిస్తున్నారు. 2004 నుంచి రికార్డుల్లో ఉన్న తమ పేర్లు మారిపోవడంతో 2006 నుంచి భూమి కోసం పోరాడుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ వి.హన్మంతరావు మాట్లాడుతూ 'దళితుల భూమి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయడం లేదు' అని బహిరంగంగా ఆరోపించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. కీసరలో 1981లో కౌలులో ఉన్న సర్వే నంబర్లు 179, 213, 174, 175, 176, 173లో 94.02 ఎకరాలను అప్పటి పట్టాదారైన రాగి కృష్ణారెడ్డి 10 మంది దళితులు పుండ్రు సాయన్న, కుంతల బాలయ్య, కుంతల పోచయ్య, నర్సయ్య, పుండ్రు నర్సయ్య, సాయన్న, మెరుగు సాయన్న, కుంతల బాలయ్య, తుడుం పోచయ్య, తుడుం ఆగయ్యకు 38-ఈ కింద ఇచ్చాడు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో కీసరలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఈ క్రమంలో జీవో నం.1717 ద్వారా పుండ్రు నర్సయ్య, మెరుగు సాయన్న, శీలం సాయన్న, తుడుం ఆగయ్య, కుంతల బాలయ్యకు చెందిన భూమిని కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఫోర్జరీ సంతకాలతో 2004లో తమ పేరిట నమోదు చేసుకున్నారని, ఆ భూమిని ఇతరులకు విక్రయించి భూ కుంభకోణానికి పాల్పడ్డారని కౌలు రైతుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆ భూముల్లో హెచ్ఎండీఏ అనుమతుల మేరకు ఇండ్ల నిర్మాణాలు (విల్లా ప్రాజెక్ట్) కొనసాగుతున్నాయి.

వీహెచ్ మాటలు చర్చనీయాంశం

కీసరలో దళితల భూమి విషయం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి వచ్చినా స్పందించడం లేదని, భూమి వారసులైన 120 మంది దళితులకు న్యాయం జరగక రోడ్డుపై పడ్డారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు తాజాగా సొంత ప్రభుత్వంపైనే ఆరోపణలు చేశారు. 'ఇంది రమ్మ ప్రభుత్వం అంటే ఇదేనా? దళితులకు పది రోజుల్లో న్యాయం జరగకుంటే ఆమరణ దీక్షకు దీగుతా' అని ఆయన చెప్పిన మాటలు మేడ్చల్ జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. కాగా ఈ భూముల లే అవుట్‌కు 2010లోనే అనుమతులు వచ్చినట్టు అధికారులు స్పష్టం చేస్తున్నారు. లే అవుట్ అనుమతులు ఉన్నందునే ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్నట్టు పేర్కొంటున్నారు. ప్రస్తుతానికి ఈ భూమిపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని చెబుతున్నారు.

ఫిడే రేటెడ్ చెస్ చాంప్ ఆకాష్

ఫిడే రేటెడ్ చెస్ చాంప్ విజేతలతో గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ కే.కేశవన్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, జూన్ 16: ఫిడే రేటెడ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను ఆకాష్ కుమార్ సొంతం చేసుకున్నారు. తెలంగాణ చెస్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన అండర్-15 ఫైనల్ రౌండ్‌లో ఆకాష్ కుమార్ 4-2 పాయింట్ల తేడాతో మహేశ్వరిపై విజయం సాధించారు. అండర్-13లో మనోహర్ ప్రేమ్ 5-4 పాయింట్ల తేడాతో అహిల్ అహ్మద్ హుస్సేన్ షేక్‌పై గెలుపొందారు. విజేతలకు గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ కే.కేశవన్, చెస్ అకాడమీ ప్రతినిధులు శ్రీనివాసరాజు, మహేష్ బాబు, తేజావత్ నరేష్ బహుమతులను అందజేశారు.

నగర క్రీడాకారులతో యోగా దినోత్సవం

జాతీయ యోగా దినోత్సవంలో తెలంగాణ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సత్యారెడ్డి ప్రధాన కార్యదర్శి బ్రిజ్ భూషణ్ పురోహిత్

హైదరాబాద్ ఆట ప్రతినిధి, జూన్ 16: 10వ జాతీయ యోగా దినోత్సవం తెలంగాణ యోగా అసోసియేషన్, నమస్తే యోగా అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో యోగా క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు సత్యారెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రిజ్ భూషణ్ పురోహిత్, ఉపాధ్యక్షుడు ఎస్.రవి కుమార్, యోగాచార్యులు కె.బాలయ్య, చంద్రకాంత్, ప్రభాకర్, ఎం.కోటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 21వ తేదీ పెరేడ్ గ్రౌండ్స్‌లో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బ్రిజ్ భూషణ్ పురోహిత్ తెలిపారు.